

జఫర్‌గఢ్‌లో శివుడి ధ్వజ స్తంభానికి మంగళహారతులతో స్వాగతం పలుకుతూ ఊరేగిస్తున్న గ్రామస్థులు

ధ్వజ స్తంభం ఊరేగింపు

- శివనామ కీర్తనలతో మార్మోగిన పురవీధులు
- మంగళహారతులు, జలాభిషేకాలతో పూజలు

జఫర్‌గడ్, ఏప్రిల్ 17 : మండల కేంద్రంలోని శ్రీ ఉమానీలకంఠ పరమేశ్వరస్వామి ఆలయంలో ప్రతిష్ఠాపన కోసం నూతన ధ్వజ స్తంభాన్ని బుధవారం రాత్రి ఊరేగించారు. శివాలయంలోని ధ్వజ స్తంభం శిథిలావస్థకు చేరుకోవడంతో హైదరాబాద్‌కు చెందిన ఓ భక్తుడి ఆర్థిక సహకారంతో ఒకే శిలతో 27 ఫీట్ల ఎత్తులో గల నూతన ధ్వజ స్తంభాన్ని తయారు చేయించారు. ఈ స్తంభం బుధవారం రాత్రి వాహనంలో మండల కేంద్రానికి తీసుకురావడంతో ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు, గ్రామస్థులు, భక్తజనులు, మహిళలు పెద్ద ఎత్తున ఎదురేగి స్వాగతం పలికారు. మంగళహారతులు, జలాభిషేకాలతో భక్తి శ్రద్ధలతో పూజలు జరిపారు. భక్తజనుల జయ జయధ్వానాలు, డీజే సౌండ్ సిస్టం, శివ నామ స్తోత్రాలు, కీర్తనలతో పురవీధులు మార్మోగాయి. ఈనెల 22 నుంచి నిర్వహించే ఆలయ ధ్వజస్తంభ పునః ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో భాగంగా 24న బుధవారం వేద బ్రాహ్మణ పండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ శివాలయంలో రాతి ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మంచాల ఎల్లయ్య, గౌరవ అధ్యక్షుడు అన్నెబోయిన భిక్షపతి, కమిటీ ప్రతినిధులు ఎ.యుగంధర్, టి.యాకయ్య, సోమశేఖర్, జ్యోతి యాకయ్య, సింగారపు రమేశ్, సోమేశ్వర్, ఈరబత్తిని అంజయ్య, బైరి రవి, పి.దాసు, పి.కృష్ణ పి.విజయ్ గౌడ్, టి.రాజేందర్, నంచర్ల యాదగిరి, సాకి సాంబయ్య, మొట్టక ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



జీడికల్‌లో కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు



నవాబుపేటలో కొలువుదీరిన సీతారాములు



నవాబుపేటలో తాళిబొట్టు చూపిస్తున్న వేదపండితుడు

కనగ కనగ కమనీయమే..

- జిల్లావ్యాప్తంగా ఘనంగా శ్రీరామనవమి వేడుకలు
- నవాబుపేట, జీడికల్, వల్మిడి ఆలయాలకు పోటెత్తిన భక్తులు

లింగాలఘణపురం/పాలకుర్తి ఏప్రిల్17: కనగ కనగ కమనీయమే.. వినగ వినగ రమణీయమే.. అన్నతీరుగా జిల్లా వ్యాప్తంగా శ్రీరామనవమి వేడుకలు బుధవారం ఘనంగా జరిపించారు. జై శ్రీరామ్.. అంటూ ఆలయాలు, మంటపాల పరిసరాలు ప్రతిధ్వనించాయి. ప్రజలు భక్తి శ్రద్ధలతో సీతారామ కల్యాణాన్ని వీక్షించి తన్మయత్వం పొందారు. లింగాలఘణపురం మండలం నవాబుపేట శ్రీకోదండరామస్వామి ఆలయం, జీడికల్ శ్రీరామచంద్రస్వామి ఆలయంలో శ్రీసీతారామచంద్రుల కల్యాణోత్సవం అత్యంత వైభవో పేతంగా జరిగింది. చూచువారలకు చూడముచ్చటగా పిడికిట తలంబ్రాల పెళ్లికూతురు సీతమ్మవారిని రఘువంశనాయకుడు శ్రీరామచంద్రుడు మనువాడాడు. వేద బ్రాహ్మణుల మంత్రోచ్చారణలు, సన్నాయి మేళతాళాలు, చలువ పందిళ్ల నీడన భక్తుల జయ జయధ్వానాల నడుమ శ్రీసీతారాముల కల్యాణం వైభోగంగా సాగింది. ఆద్యంతం కల్యాణం జరుగుతున్నంతసేపు భక్తుల జయజ యధ్వానాలు, హరేరామ హరేరామ.. రామ రామ హరేహరే.. హరేకృష్ణ హరేకృష్ణ.. అంటూ భక్తుల రా మనామజపంతో ఆలయ ప్రాంగణం భక్తిభావంతో తొణికిసలాడింది. జీడికల్‌లో ఆలయ కార్యనిర్వహణాధికారి వంశీ స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. కల్యాణం అనంతరం నవాబు పేట శ్రీకోదండ రామస్వామి ఆలయంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. అదేవిధంగా మండలంలోని నేలపోగుల, నెల్లుట్ల, వనపర్తి, బండ్లగూడెం, శ్రీనివాసనగర్ కాలనీలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా జరిగాయి.

కార్యక్రమంలో ఎంపీపీ చిట్ల జయశ్రీఉపేందర్‌రెడ్డి, నాయకులు కుర్రెముల మోహన్, కొండబోయిన రాములు, మల్లేశం, అర్చకులు భార్గవాచార్యులు, రవికిరణాచార్యులు, కరుణాకర్, లక్ష్మీనర్సింహాచార్యులు, ఉత్సవ కమిటీ సభ్యులు ఏలె మూర్తి, మైదం ప్రభాకర్, వంశపారంపర్య చైర్మన్ సునీతసురేశ్‌బాబు పాల్గొన్నారు.

కన్నుల పండువగా శ్రీ సీతారాముల కల్యాణం

వల్మిడికి హాజరైన ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, మాజీ మంత్రి దయాకర్‌రావు

పాలకుర్తి మండలం వల్మిడి గ్రామంలోని గుట్టపై శ్రీ సీతారాంచంద్రస్వామి ఆలయంలో శ్రీ సీతారామల కల్యాణం బుధవారం కమనీయంగా కన్నుల పండువగా నిర్వహించారు. మంగళ వాయిద్యాలు, వేద పారాయణంతో ఉత్సవ మూర్తులను కల్యాణ మండపానికి తీసుకువచ్చారు. మధ్యాహ్నం 12:15 గంటలకు ప్రారంభమైన కల్యాణ మహోత్సవం సాంప్రదాయ రీతిలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. సీతారాములను సర్వాంగసుందరంగా అలంకరించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన వందలాది మంది భక్తులు కల్యాణోత్సవాన్ని తిలకించారు. ఈ ఉత్సవంలో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు హాజరయ్యారు. కాగా, ఎమ్మెల్యే దంపతులు వేదికకు ఎదురుగా కూర్చునే విధంగా ఏర్పాట్లు చేయగా, ఎర్రబెల్లి దయాకర్‌రావు వేదికకు ఎడమ వైపున ఏర్పాటు చేశారు. సుమారు రెండు గంటల పాటు సీతారాముల కల్యాణోత్సవాన్ని కన్నులార తిలకించారు. అదే విధంగా శ్రీ సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో జరిగిన సీతా రాముల కల్యాణోత్సవానికి దయాకర్‌రావు హాజరై ప్రత్యేక పూజలు చేశారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకుడు లేగరా మ్యానొరెడ్డి, జనగామ డీసీపీ సీతారాం, వర్ధన్నపేట ఏసీపీ నర్సయ్య, బ్లాక్ అధ్యక్షుడు రాపాక సత్యానా రాయణ, మండల అధ్యక్షుడు గిరగాని, కాకిరాల హరిప్రసాద్, పెదగాని సోమన్న, ఎంపీపీ నాగిరెడ్డి, యాకాంతరావు, ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ బొబ్బాల అశోక్‌రెడ్డి, ఎంపీటీసీలు తాళ్ల సోమనారాయణ, పురుషోత్తం, వీరమల్ల రాజు, తదితరులు పాల్గొన్నారు.





వల్మిడిలో సీతారాముల కల్యాణానికి హాజరైన ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి దంపతులు, కల్యాణ తంతు జరిపిస్తున్న పండితులు



వల్మిడిలో ఉత్సవాలకు హాజరై భక్తుల మధ్య కూర్చున్న మాజీ మంత్రి దయాకర్‌రావు

నామినేషన్ల ప్రక్రియకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- 28న ఈవీఎంల ర్యాండమైజేషన్ ప్రక్రియ చేపట్టాలి
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్

హనుమకొండ కలెక్టరేట్, ఏప్రిల్ 17: రాష్ట్రంలోని ఆయా లోక్‌సభ స్థానాలకు సంబంధించి గురువారం నుంచి ప్రారంభమయ్యే నామినేషన్ల ప్రక్రియకు రిటర్నింగ్ అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ కోరారు. బుధవారం రాత్రి హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఎన్నికల నోడల్ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వికాస్‌రాజ్ మాట్లాడుతూ.. నామినేషన్ల ప్రక్రియ సందర్భంగా ఆర్వో కార్యాలయాల వద్ద ఎన్నికల సంఘం నియమ నిబంధనల ప్రకారం అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. ఈనెల 28వ తేదీన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంల రాండమైజేషన్ ప్రక్రియ చేపట్టాలన్నారు. అదేవిధంగా సర్వీస్ ఓటర్లు, పోస్టల్ బ్యాలెట్, డైలీ రిపోర్ట్, నామినేషన్ల ప్రక్రియకు సంబంధించిన పలు అంశాలను ఈ సందర్భంగా వికాస్ రాజ్ వివరించారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో హనుమకొండ జిల్లా కలెక్టరేట్ నుంచి కలెక్టర్ సిక్తా పట్నాయక్, అదనపు కలెక్టర్ రాధిక గుప్తా, ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, సెంట్రల్ జోన్ డీసీపీ ఎంఎ బారీ, డీఆర్‌ఓ వైవీ గణేష్, జడ్పీ సీఈవో విద్యాలత, డీఆర్‌డీఓ నాగ పద్మజ, ఆర్డీవోలు, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

సివిల్స్ ర్యాంకర్లకు సన్మానం

- కౌశిక్‌ను అభినందించిన ఎమ్మెల్యే పల్లా
- ప్రణయ్‌కుమార్‌కు గ్రామస్థుల ప్రశంస

జనగామ కల్చరల్/రఘునాథపల్లి, ఏప్రిల్ 17: యూపీఎస్సీ ఫలితాల్లో 82వ ర్యాంకు సాధించిన మెరుగు కౌశిక్‌ను బుధవారం ఘనంగా సన్మానించారు. సివిల్స్‌లో ర్యాంకు సాధించిన కౌశిక్ తొలిసారిగా జన్మస్థలమైన జనగామకు రావడంతో పలువురు సన్నిహితులు, మిత్రులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. బాణాసంచా కాల్చి సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం శాలువాతో ఘనంగా సన్మానించి మిఠాయి పంచిపెట్టారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి దంపతులు కౌశిక్‌ను అభినందించి బొకే అందించి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉన్నత స్థానంలో ఉండి తెలంగాణ రాష్ట్ర భవిష్యత్తును తీర్చిదిద్దాలని కోరారు. కౌశిక్‌ను ప్రోత్సహించిన తల్లిదండ్రులను అభినందించారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ పోకల జమున, నాయకులు బండ యాదగిరిరెడ్డి, డాక్టర్ సుగుణాకర్‌రాజు, సెవెల్లి సంపత్, రంగు రవి, సుధాకర్, సెయింట్ పాల్స్ హైస్కూల్ ప్రిన్సిపాల్ మరియ జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

అదేవిధంగా సివిల్స్‌లో 554వ ర్యాంకు సాధించిన రఘునాథపల్లికి చెందిన కొయ్యడ ప్రభాకర్-లక్ష్మి దంపతుల కుమారుడు ప్రణయ్ కుమార్‌ను స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రణయ్ కుమార్ మాట్లాడుతూ సమాజాభివద్ధి కోసం ఏదో ఒకటి చేయాలనే సంకల్పంతో కష్టపడ్డాడని, అంబేద్కర్ చెప్పినట్లు విద్య అనేది చాల గొప్ప ఆయుధమని తెలుసుకొని ఆ మార్గాన్నే ఎంచుకున్నానని, అందరి ఆశీస్సులతో ఐఏఎస్‌కు ఎంపికయ్యానని అన్నారు. సమాజంలో పేద ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అంకిత భావంతో కృషి చేస్తూ రఘునాథపల్లి బిడ్డగా అందరి మన్ననలు పొందడమే ధ్యేయంగా పని చేస్తానని అన్నారు. అనంతరం ప్రణయ్ కుమార్‌ను అభినందిస్తూ గ్రామంలో డప్పు చప్పులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ బొల్లం అజయ్‌మణికంఠ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోళ్ల రవి గౌడ్, మేకల నరేందర్, పేర్ని రవి, రంగోజు ఈశ్వరయ్య, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర నాయకుడు కొయ్యడ మల్లేష్, కడారి రవి,శాగ కైలాసం, పెద్దగోని రాజు తదితరులు పాల్గొన్నారు.



జనగామలో మెరుగు కౌశిక్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



రఘునాథపల్లిలో కొయ్యడ ప్రణయ్ కుమార్‌ను సన్మానిస్తున్న గ్రామస్థులు

సీఎం సభా స్థలి పరిశీలన

మడికొండ, ఏప్రిల్ 17: సీఎం రేవంత్‌రెడ్డి ఈనెల 24న హనుమకొండ జిల్లాలో పర్యటించనున్నారు. ఈ మేరకు బహిరంగ సభ నిర్వహణ కోసం బుధవారం లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మడికొండలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదురుగా ఉన్న స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సీఎం సభ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాష్‌రెడ్డి, కడియం శ్రీహరి తదితరులు

నామినేషన్ల స్వీకరణకు వేళాయే..

- నేటి నుంచి లోక్‌సభ స్థానాలకు నామినేషన్లు
- ఈ నెల 25వ తేదీ వరకు స్వీకరణ
- 26న పరిశీలన, 29న ఉపసంహరణలకు గడువు
- మే 13న వరంగల్, మహబూబాబాద్ ఎంపీ స్థానాలకు ఎన్నికలు
- జూన్ 4న ఓట్ల లెక్కింపు
- రెండు జిల్లాల కలెక్టరేట్‌లల్లో విస్తృత ఏర్పాట్లు
- ఖరారైన ప్రధాన పార్టీల అభ్యర్థులు
- ప్రచార పర్వంలోకి ప్రధాన పార్టీలు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

లోక్‌సభ ఎన్నికలకు కౌంట్‌డౌన్ మొదలైంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వరంగల్, మహబూబా బాద్ లోక్‌సభ ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థుల నామినేషన్లను గురువారం నుంచి స్వీకరించనున్నారు. ఇందుకోసం ఎన్నికల రిటర్నింగ్ అధికారులుగా ఉన్న వరంగల్, మహబూబాబాద్ జిల్లా కలెక్టర్లు నామినేషన్లు స్వీకరించేందుకు కలెక్టరేట్‌లలో విస్తృత ఏర్పాట్లు చేశారు. గురువారం నుంచి ఈనెల 25వ తేదీవరకు నామినేషన్ల స్వీకరించనున్నారు. మే 13న రెండు లోక్‌సభ స్థానాలకు పోలింగ్ జరుగనుంది. జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. ఇప్పటికే అధికారులు ఓటరు జాబితాను సిద్ధం చేశారు. మరోవైపు ప్రధాన పార్టీల అభ్యర్థులు ఖరారు కావటంతో ఓట్ల కోసం ప్రజాక్షేత్రంలో మండుటెండను లెక్క చేయకుండా ప్రచారపర్వంలో చెమటోడ్చుతున్నారు.

నేటి నుంచి నామినేషన్లు స్వీకరణ

దేశవ్యాప్తంగా జరుగుతున్న లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా 4వ దశలో తెలంగాణలో ఎన్నికలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వరంగల్, మహబూబాబాద్ లోక్‌సభ స్థానాలకు మార్చి 16న కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించింది. గురువారం నుంచి నామినేషన్లను స్వీకరించేందుకు వరంగల్, మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో విస్తృతంగా ఏర్పాట్లు చేశారు. ఈ నెల 25వ తేదీ వరకు నామినేషన్లకు గడువు ఇచ్చారు. 26వ తేదీన వచ్చిన నామినేషన్లను ఎన్నికల రిటర్నింగ్ అధికారి సమక్షంలో పరిశీలన చేయనున్నారు. 27 శనివారం, 28 ఆదివారం కావటంతో రెండు రోజులు సెలవులు. 29వ తేదీన ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల జాబితాతో పాటు ఎన్నికల గుర్తులను కూడా కేటాయించనున్నారు. మే 13వ తేదీన రెండు లోక్‌సభ పరిధిలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపు చేపట్టి విజేతలను ప్రకటించనున్నారు.



వరంగల్ కలెక్టరేట్‌లో నామినేషన్ల స్వీకరణపై ట్రయల్ నిర్వహిస్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్య

విస్తృత ఏర్పాట్లు

నామినేషన్ పత్రాలు దాఖలు చేసేందుకు కలెక్టరేట్‌లోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి వద్దకు అభ్యర్థితో పాటు మరో ఐదుగురికి మాత్రమే అవకాశం ఉంటుంది. ఒక్క అభ్యర్థి నాలుగు సెట్లలో నామినేషన్ దాఖలు చేసే అవకాశం ఉంది. 18వ తేదీ నుంచి 25వ తేదీ వరకు ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకే నామినేషన్లు స్వీకరిస్తారు. మధ్యాహ్నం 3గంటల తరువాత వచ్చే నామినేషన్లను స్వీకరించరని వరంగల్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి పి.ప్రావీణ్య తెలిపారు. అలాగే పోలింగ్ కేంద్రాల్లో ఓటరుకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా దృష్టిసారిస్తున్నారు. ముఖ్యంగా దివ్యాంగులు, గర్భిణులు సులువుగా పోలింగ్ కేంద్రాలకు వచ్చేందుకు ఏర్పాట్లు చేసున్నారు. ఓటరు ఫెలిసిటేషన్ సెంటర్, హెల్ప్ డెస్క్, సిగ్నేజ్, షెడ్, తగిన లైటింగ్ సౌకర్యం ఉండేలా ఏర్పా ట్లు చేస్తున్నారు.

అభ్యర్థులు సిద్ధం

లోక్‌సభ ఎన్నికల నామినేషన్లకు అభ్యర్థులు సిద్ధమవుతున్నారు. మహబూబాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి బలరాంనాయక్ ఈనెల 19వ తేదీన నామినేషన్ వేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. బలరాంనాయక్ నామినేషన్ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొననున్నారు. అలాగే 21 లేదా 22వ తేదీన బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులు నామినేషన్లు వేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లేదా మాజీ మంత్రి హరీష్ రావు కవిత నామినేష్ల ప్రక్రియలో పాల్గొనే అవకాశం ఉన్నట్లు గులాబీ నేతలు పేర్కొంటున్నారు. అలాగే బీజేపీ అభ్యర్థి సీతారాం నాయక్ నామినేషన్ సందర్భంగా బీజేపీ సీనియర్ నేత డాక్టర్ లక్ష్మణ్ వచ్చే అవకాశం ఉందని సమాచారం. అలాగే వరంగల్ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య మొదటి సెట్ 22వ తేదీన దాఖలు చేస్తుండగా, 24వ తేదీన మరో సెట్ నామినేషన్ వేయనున్నారు. 24వ తేదీన కావ్య నామినేషన్ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి హాజరుకానున్నారు. ఈ సందర్భంగా మడికొండలో బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నారు. అలాగే బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ 24వ తేదీన నామినేషన్ వేయనున్నారు. అరూరి రమేష్ నామినేషన్ ఘట్టానికి బీజేపీ తమిళనాడు రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై వచ్చే అవకాశం ఉంది. బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్‌కుమార్ 22వ తేదీన నామినేషన్లు వేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

అధికారులు సిద్ధం

ఎన్నికలు సజావుగా జరిగేందుకు పోలీసు యంత్రాంగం విస్తృతంగా ఏర్పాట్లు చేపట్టింది. నగదు రవాణా, మద్యం అమ్మకాలపై ప్రత్యేకంగా దృష్టిపెట్టింది. వరంగల్, మహబూబాబాద్ కలెక్టరేట్‌ల వద్ద 144సెక్షన్ అమలు చేయనున్నారు. మరోవైపు మండుటెండలను సైతం లెక్క చేయకుండా అభ్యర్థులు ప్రజాక్షేత్రంలో ఓట్ల వేటకు దిగుతున్నారు. కీలక నేతలను కలుసుకోవటంతో పాటు బూత్ స్థాయి సమావేశాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. మొత్తానికి గురువారం నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం అవుతుండటంతో ఎన్నికల ప్రచారం మరింతగా హీటెక్కనుంది.

ఓటర్ల లెక్క ఇదీ..!

7లో..

- వరంగల్‌లో 18,16,543 మంది ఓటర్లు
- మహబూబాబాద్‌లో 15,30,367 ఓటర్లు
- ఓటరు జాబితాను సిద్ధం చేసిన అధికారులు



గుంటూర్‌పల్లిలో పత్తిని తొలగించి సిద్ధం చేసిన నేల

వేసవి దుక్కులు మేలు

- భూమిలో తేమ శాతం పెరుగుదల
- కలుపు మొక్కల నివారణ.. నేల సారవంతం
- భూసార పరీక్షలు తప్పనిసరి

నర్మెట, ఏప్రిల్ 17: యాసంగి పంటలు పూర్తయ్యాక భూములను అలాగే వదిలేస్తే కలుపు మొక్కలు పెరిగి వానాకాలం పంటలకు ముప్పు ఏర్పడుతుంది. వానాకాలం సాగుకు ముందే నేలలను ట్రాక్టర్లతో లోతుగా పొడి దుక్కి చేసుకుంటే అనేక ప్రయోజనాలు ఉంటాయి. పంటలకు నష్టం కలిగించే కలుపు మొక్కల పెరుగుదలను నివారించవచ్చు. వర్షాకాలంలోపు మూడు దుక్కులు దున్ని సిద్ధంగా ఉంటే భూమిలో తేమ నిలుస్తుంది. లేదంటే కలుపు మొక్కలు పెరిగి పోషక పదార్థాలను గ్రహించి భూములను నిస్సారం చేస్తాయి.

కలుపు మొక్కల నివారణ

యాసంగి తర్వాత భూములను వృథాగా ఉంచితే కలుపు మొక్కలు పెరిగి భూసారానికి నష్టం కల్గించడంతో పాలు చీడపీడలకు ఆశ్రమం ఇచ్చినట్టవుతుంది. తుంగ, గునుగు, అలం మొదలైన మొక్కలు అన్ని రకాల భూముల్లో పెరుగుతాయి. బహువార్షిక ఏరు దుంపలను కలిగిన తుంగ వేర్లలో ఆహారం నిల్వ చేసుకొని భూసారాన్ని దెబ్బ తీస్తుంది. వేసవిలో లోతైన దుక్కులను దున్నడంతో ఇవి నశిస్తాయి.

ప్రయోజనాలు..

వేసవి కాలంలో భూములను లోతుగా దున్నుకోవాలి. దీంతో తొలకరి వర్షాలకు పెల్లలు మెత్తబడి నీరు భూమిలోకి ఇంకుతుంది. దుక్కులు లోతుగా వాలుకు అడ్డంగా దున్నుకుంటే వర్షపు నీరు భూమిలోకి ఇంకి తేమను నిల్వ చేసే సామర్థ్యం పెరుగుతుంది. దుక్కులు దున్నే ముందు భూమిలో పశువుల ఎరువు, కంపోస్టు ఎరువులు, చెరువు మట్టి వేసుకుంటే భూమి సారవంతమవడమే కాకుండా తేమ నిల్వ చేసుకునే శక్తి పెరుగుతుంది. భూములను వృథాగా వదిలేస్తే నేల గట్టిపడి వర్షపు నీరు ఇంకదు. అంతేగాకుండా పంటలు వేసిన సమయంలో నార్లు సరిగ్గా చొచ్చుకొని పోలేక పోషక పదార్థాలు పూర్తిగా అందక పంటలు సక్రమంగా ఎదగవు. భూమిని లోతుగా దుక్కి చేస్తేనే భూమి గుల్లగా మారి నీటి నిల్వ శక్తి పెరుగుతుంది. తేమతో జీవించే సూక్ష్మజీవులు, వానపాముల సంతతి పెరిగి భూమి సారవంతమవుతుంది.

వేసవి దుక్కులను తప్పనిసరిగా చేసుకోవాలి

డి.సంతోషి, వ్యవసాయ అధికారి



రైతులు వానాకాలం పంటల సాగుకు ముందు దుక్కులను దున్ని సిద్ధం చేసుకోవాలి. దీంతో తొలకరి వర్షపు నీరు భూమిలోకి బాగా ఇంకుతుంది. తేమ పెరిగి మట్టి మెత్తబడుతుంది. తర్వాత భూసార పరీక్షలు చేయించుకొని అధికారుల సలహా మేరకు పంటలను ఎంచుకొని సాగుచేసుకోవాలి. దీనివల్ల పంటల్లో అధిక దిగుబడి వచ్చే అవకాశం ఉంటుంది.

28 నుంచి దూరవిద్య డిగ్రీ మొదటి సెమిస్టర్ తరగతులు

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 17: ఈనెల 28 నుంచి కేయూ దూరవిద్య కేంద్రం డిగ్రీ కోర్సుల మొదటి సెమిస్టర్ కాంట్రాక్టు తరగతులు నిర్వహిస్తామని కేయూ దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 28 మే 5, 11, 12, 19,26, 27, 28, 29, 30 తేదీల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు తరగతులు నిర్వహిస్తామని వెల్లడించారు. కేయూ పరిధిలోని దూరవిద్య కేంద్రంలో స్టడీ సెంటర్లలో తరగతులు జరుగుతాయని తెలిపారు.

హనుమకొండ సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, ఉట్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నిర్మల్ పంచశీల కాలేజీ ఆఫ్ ఎడ్యుకేషన్, జనగామ ఆర్ఆర్ఎం కాలేజీ, ఎస్ఆర్ఆర్ కాలేజీ, కౌటలా శ్రీ చైతన్య డిగ్రీ కాలేజీ శ్రీఆరంపూర్, స్వాతి డిగ్రీ కళాశాల లక్సెట్టిపేట, వైష్ణవి ఉమెన్స్ డిగ్రీ కళాశాలలో తరగతులు జరుగుతాయని వెల్లడించారు. అభ్యర్థులు తరగతులకు హాజరుకావాలని డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం సూచించారు.

రైలులో గుర్తుతెలియని మృతదేహం లభ్యం



గుర్తు తెలియని మృతదేహం

కాజీపేట, ఏప్రిల్ 17: కాజీపేట రైల్వేస్టేషన్‌లో రామగిరి రైలులో గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. కాజీపేట రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాజీపేట రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫామ్-2లో రామగిరి రైలులో మంగళవారం ఓగుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. మృతుడి వయస్సు 55 - 60 యేళ్ల ఉంటుందని, తెల్ల గడ్డం, 5,4 ఎత్తు బ్లూషర్ట్‌పై వైట్‌లైన్స్, నీలం రంగు లుంగీ ధరించి ఉన్నాడని పోలీసులు తెలిపారు. మృతుడిని గుర్తించడానికి ఎలాంటి ఆనవాళ్లు లేవు. రైల్వే ఉద్యోగుల సమాచారం మేరకు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ఎంజీఎంలో భద్రపర్చామని, ఆచూకీ తెలిసిన వారు కాజీపేట రైల్వే పోలీస్ స్టేషన్ ఫోన్‌నంబర్ 87126 58609, 99498 59108కు సమాచారం ఇవ్వాలని రైల్వే పోలీసులు తెలిపారు.

యువతి అదృశ్యం

హనుమకొండ టౌన్, ఏప్రిల్17: అమృత థియేటర్ సమీపంలోని గుడిబండల్ ప్రాంతానికి చెందిన తన బిడ్డ అదృశ్యమైందని తండ్రి హనుమకొండ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే.. కరీంనగర్ రోడ్డులోని ఓ ప్రైవేట్ యూనివర్శిటీలో ఎంబీఏ చదువుతున్న యువతి(23) బుధవారం మధ్యాహ్నం కిరాణం షాపునకు వెళ్తున్నానని చెప్పి తిరిగి రాలేదు. ఎక్కడ వెతికినా సమాచారం దొరకలేదు. చింతగట్టు క్యాంపునకు చెందిన ఓ యువకుడిపై అనుమానం ఉందని తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేసవి క్రికెట్ శిక్షణా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి..

డబ్ల్యూడీసీఏ ప్రధాన కార్యదర్శి చాగంటి శ్రీనివాస్

వరంగల్ స్పోర్ట్స్, ఏప్రిల్17: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ఆదేశాల మేరకు వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ (డబ్ల్యూడీసీఏ) ఆధ్వర్యంలో ఏప్రిల్ 20 నుంచి మే 20వ తేదీ వరకు నెల పాటు నిర్వహించనున్న వేసవి ఉచిత క్రికెట్ శిక్షణా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ (డబ్ల్యూడీసీఏ) ప్రధాన కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ తెలిపారు. బుధవారం వరంగల్ మండిబజార్‌లోని డబ్ల్యూడీసీఏ కార్యాలయంలో డబ్ల్యూడీసీఏ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈసీ సమావేశంలో చాగంటి శ్రీనివాస్ పాల్గొని వేసవి క్రికెట్ శిక్షణా శిబిరాల వివరాలను వెల్లడించారు. ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా వరంగల్, పరకాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్ 5 సెంటర్లను ఎంపిక చేయగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే క్రీడాకారులకు గురువారంతో గడువు ముగియనున్నట్లు ఆయన తెలిపారు.

అండర్-14, 16, 19, 23 బాల బాలికలకు నిష్ణాతులైన కోచ్‌ల పర్యవేక్షణలో రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో శిక్షణ అందిసామన్నారు. గ్రామీణ ప్రాంతాలలోని క్రీడాకారులను ప్రోత్సహించే ఉద్దేశంతో నెల రోజుల పాటు నిర్వహించనున్న వేసవి క్రికెట్ శిక్షణా శిబిరాల ప్రతీ సెంటర్‌లో పాల్గొనే క్రీడాకారులకు జంబో క్రికెట్ కిట్, మ్యాట్, బ్యాక్‌నెట్, గ్రేస్‌బాల్స్, టెన్నిస్‌బాల్స్‌తో పాటు శిబిరంలో పాల్గొనే ప్రతీ ఒక్క క్రీడాకారుడికి పౌష్టికాహారంగా కోడిగుడ్డు, అరటి పండ్లను ఉచితంగా అందిస్తామన్నారు. అదే విధంగా శిబిరాలలో కోచింగ్ ఇవ్వనున్న కోచ్‌లకు రూ.15వేలు, గ్రౌండ్ మెన్లకు రూ.10వేల చొప్పున గౌరవ వేతనం అందించాలని ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అసోసియేషన్ పాలకవర్గం ఏకగ్రీవ తీర్మానాన్ని చేసిందన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్న వేసవి క్రికెట్ శిక్షణ శిబిరాలలో యువత పెద్ద ఎత్తున పాల్గొనాలని శ్రీనివాస్ సూచించారు.

నేటితో ముగియనున్న స్వీకరణ

హెచ్‌సీఏ ఆదేశాల మేరకు డబ్ల్యూడీసీఏ ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్న ఉచిత వేసవి క్రికెట్ శిక్షణ శిబిరాల ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ గురువారంతో ముగియనున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి చాగంటి శ్రీనివాస్‌లో తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన క్రీడాకారులు తమ పేర్లను టీటీటీ.జీఖిటజీచిజ్బ్యూ౯టజ వెబ్ సైట్‌లో నమోదు చేసుకోవలని సూచించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికే శిక్షణ శిబిరంలో పాల్గొనే అవకాశం ఉంటుదని, శిక్షణా శిబిరానికి ఎంపికైన క్రీడాకారులు వైట్ యూనిఫామ్‌తో రావాలని కోరారు. శిక్షణా శిబిరంలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు మే నెల చివరి వారంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి టీడీఎల్ - 2024 టోర్నమెంట్‌కు ఎంపిక చేయడమే కాకుండా హెచ్‌సీఏ అకాడమీకి ఎంపిక చేస్తామన్నారు.

ఐదు జిల్లా కేంద్రాల్లో శిక్షణ

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఐదు జిల్లా కేంద్రాలలోని క్రీడా మైదానాలలో శిక్షణ శిబిరాలను ఎంపిక చేశారు. వరంగల్ ఎల్బీ కళాశాల క్రీడా మైదానం కోచ్‌లు గోవిందసింగ్, బి.వేణు, మహిళా కోచ్ యూనిస్ సెల్ నెంబర్ 9849570979, పరకాల జూనియర్ కళాశాల క్రీడా మైదానం కోచ్‌లు బొజ్జం అరుణ్ సెల్ 9666206662, జయశంకర్ భూపాలపల్లి, సింగరేణి క్రీడా మైదానం కోచ్‌లు కర్ణాకర్, రాజ్‌కుమార్ సెల్ 8897805683, ములుగు తంగేడు క్రీడా మైదానంలో కోచ్‌లు మట్టెడ కుమార్, సందీప్‌నేత్ర సెల్ 9030130727, మహబూబాబాద్ సిద్ధార్థ హైస్కూల్ క్రీడా మైదానం కోచ్‌లు కుమార్, వినయ్ సెల్ 9866479666 నెంబర్‌లలో కోచ్‌లు అందుబాటులో ఉంటారు. ఈ సమావేశంలో డబ్ల్యూడీసీఏ జిల్లా అధ్యక్షుడు పెద్ది ప్రవీణ్‌గౌడ్, ఉపాధ్యక్షులు నజీమ్, రాఘురాం, ఖాజా, కార్యవర్గ సభ్యులు అభినవ్‌వినయ్, మట్టెడ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అఫిడవిట్‌లో తప్పులుంటే ఆగమే..

- అభ్యర్థులు నేర సమాచారాన్ని తప్పనిసరిగా సమర్పించాల్సిందే
- ఆస్తులు, అప్పులను చెప్పాల్సిందే..
- అన్ని కాలమ్స్ నింపాల్సిందే

వరంగల్‌సిటీ, ఏప్రిల్ 17: లోక్‌సభ ఎన్నికలకు గురువారం నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుండగా.. అభ్యర్థులు నామపత్రాలతో పాటు సమర్పించే అఫిడవిట్ పత్రాలు కీలకంగా మారుతాయి. అభ్యర్థులు తమ వివరాలతో పాటు ఆస్తులు, అప్పులు ప్రమాణరూపంలో ముందే స్పష్టం చేయాలి. గతంలో ఏమైనా కేసులున్నా.. శిక్ష పడినా.. వాటిని పొందుపరుచాలి. వీటన్నింటిని కలిపి దాఖలు చేసే అఫిడవిట్‌లో తప్పుడు సమాచారం ఇస్తే మాత్రం అదే ప్రత్యర్థులకు ఆయుధమై కోర్టు కేసుల వరకు వెళ్లడమే కాకుండా అనర్హత వేటుకు దారి తీయవచ్చని న్యాయ నిపుణులు అంటున్నారు. ఉదాహరణకు 2023లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వర్‌రావుపై హైకోర్టు అనర్హత వేటు వేసింది. 2018 ఎన్నికల సమయంలో తప్పుడు అఫిడవిట్‌ను సమర్పించినట్లు నిర్ధారించి, ఎమ్మెల్యేగా వనమా ఎన్నిక చెల్లదని కోర్టు స్పష్టం చేసింది. ఈ తీర్పుపై వనమా సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

నేర సమాచారం చెప్పాల్సిందే...

అభ్యర్థి తనపై క్రిమినల్ కేసులు నమోదై ఉంటే వాటిని అఫిడవిట్‌లో పొందుపరచాలి. న్యాయస్థానాలు గతంలో శిక్ష విధించినా, అప్పీలుకు వెళ్లినా వాటి సమాచారాన్ని, సామాజిక మాధ్యమాల ఖాతాల వివరాలనూ తెలపాలి. అన్ని వివరాలతో కూడిన అఫిడవిట్‌కు నోటరీ తప్పనిసరి. సాధారణంగా నామినేషన్ దాఖలు చేసే సమయంలో రిటర్నింగ్ అధికారి ముందు అభ్యర్థి ప్రమాణం చేస్తారు. వేరే ఎవరైన నామినేషన్ దాఖలు చేస్తే సదరు అభ్యర్థి తాను ఉన్న ప్రాంతంలో మెజిస్ట్రేట్ ముందు ప్రమాణం చేయాలి. అలాగే అభ్యర్థులు తమపై నమోదైన కేసుల వివరాలు ప్రముఖ దినపత్రికల్లో స్పష్టంగా కనిపించేలా ప్రకటనలివ్వాలి.

ఆస్తులు, అప్పులు వెల్లడించాలి..

స్థిర, చరాస్తులతో పాటు చేతిలో, ఖాతాల్లోని నగదు, డిపాజిట్లు, ఇతర సేవింగ్స్‌ను, బీమా పాలసీలను, అప్పులు తదితర సమాచారాన్ని పొందు పర్చాలి. ఆభరణాలు, వాహనాలు, వ్యవసాయ భూములు, వాణిజ్య సముదాయాలు, నివాస స్థలాల వంటి వాటిని అఫిడవిట్‌లో పొందుపరుచాలి. అవి వారసత్వంగా వచ్చాయా.. కొనుగోలు చేశారా అన్నది పేర్కొనాలి. స్థిరాస్తికి సంబంధించిన ప్రస్తుత మార్కెట్ విలువను వెల్లడించాలి.అభ్యర్థి తోపాటు కుటుంబ సభ్యుల పేరిట రుణాలు ఉంటే వాటి వివరాలు ప్రస్తావించాలి. కుటుంబ సభ్యుల ఆదాయమార్గాలు, ప్రభుత్వ లేదా ప్రైవేటు కంపనీల కాంట్రాక్టులు ఉంటే వాటిని తెలుపాలి.

అభ్యర్థి వివరాలు తెలుసుకోవడం హక్కు

ప్రజాప్రతినిధిగా ఎన్నుకోబోయే అభ్యర్థికి సంబంధించిన అన్ని వివరాలను తెలుసుకోవడం ఓటరు హక్కు. అప్పుడే అభ్యర్థులపై స్పష్టత వస్తుంది. ఇదే విషయాన్ని కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. అందులో భాగంగానే అభ్యర్థులు తమ నామినేషన్‌తోపాటు అఫిడవిట్‌ను దాఖలు చేయాల్సి ఉంటుంది. ఎన్నికల నిబంధనలకు లోబడి ఫాం-26 రూపంలో అభ్యర్థులు అఫిడవిట్‌ను సమర్పించాలి.

అన్ని కాలమ్స్‌ను పూర్తి చేయాలి

అఫిడవిట్‌లోని ఏ ఒక్క కాలమ్ ఖాళీగా వదలవద్దని ఈసీ స్పష్టం చేసింది. అభ్యర్థులకు సంబంధం లేకపోతే ఆ కాలమ్‌లో నిల్ లేదా వర్తించదు అని రాయాలని తెలిపింది. అభ్యర్థి సమర్పించిన అఫిడవిట్‌ను గమనించి ఏదైనా సమాచారం లేకపోతే రిటర్నింగ్ అధికారి నోటీస్ ఇస్తారు. అప్పుడు సవరించిన అఫడవిట్‌ను అభ్యర్థి అందించాలి. అయినా పూర్తిస్థాయి వివరాలతో అఫిడవిట్ లేకపోతే పరిశీలన (స్క్రూటినీ) సమయంలో నామినేషన్ తిరస్కరణకు గురవుతుంది. అభ్యర్థులు దాఖలు చేసిన అఫిడవిట్లను రిటర్నింగ్ అధికారి నోటీస్ బోర్డులపై, వెబ్‌సైట్లలో పొందుపరుస్తారు.



ఫాం-26 నిబంధనలకు లోబడి ఉండాలి



తీగల జీవన్‌గౌడ్, న్యాయవాది

అభ్యర్థులు ఫాం-26 ద్వారా అఫిడవిట్‌ను ఎన్నికల నిబంధనలకు లోబడి సమర్పించాల్సి ఉంటుంది. ఆస్తులు, అప్పులు, నేర వివరాల్లో కచ్చితత్వం ఉండాలి. తప్పుడు సమాచారం ఇస్తే న్యాయ పరమైన చిక్కులు ఎదుర్కోక తప్పదు.

ఓటర్ల లెక్క ఇదీ..

- వరంగల్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో 18,16,543 మంది ఓటర్లు
- మహబూబాబాద్‌లో 15,30,367 ఓటర్లు
- జాబితా సిద్ధం చేసిన అధికారులు

వరంగల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): లోక్‌సభ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం విస్తృత ఏర్పాటు చేసింది. ఏప్రిల్ 15వ తేదీ వరకు కొత్తగా ఓటరు నమోదుకు అవకాశం కల్పించింది. అలాగే ఓటును ఇతర ప్రాంతాలకు మార్చుకునేందుకు కూడా అవకాశం ఇచ్చింది. దీంతో చాలా అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఓట్లు తగ్గిపోయాయి. కొన్ని చోట్ల పెరిగాయి. మొత్తంగా నెల రోజుల ఓటరు డ్రైవ్‌లో వరంగల్ లోక్‌సభ స్థానం పరిధిలో కొత్తగా 114 ఓట్లు మాత్రమే పెరిగాయి. మహబూబాబాద్ పరిధిలో 3,369 ఓట్లు పెరిగాయి.

వరంగల్ లోక్‌సభ పరిధిలో వరంగల్ పశ్చిమ, వరంగల్ తూర్పు, పరకాల, భూపాలపల్లి, వర్ధన్నపేట, పాలకుర్తి, స్టేషన్‌ఘనపూర్ అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. కొత్త ఓటరు జాబితా ప్రకారం వరంగల్ లోక్‌సభ పరిధిలో మొత్తం 18,16,543మంది ఓటర్లుండగా, వీరిలో పురుషులు 8,91,940 మంది, మహిళలు 9,24,208 మంది, ఇతరులు 395మంది ఓటర్లు ఉన్నారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 1,892 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అత్యధికంగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో 2,81,874 మంది ఓటర్లు ఉండగా, భూపాలపల్లి నియోజకవర్గంలో 2,76,030 మంది, వర్ధన్నపేట నియోజకరవ్గంలో 2,72,724మంది ఓటర్లు ఉన్నారు. మహబూబాబాద్ లోక్‌సభ పరిధిలో మహబూబాబాద్, డోర్నకల్, నర్సంపేట, ములుగుతో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పినపాక, ఇల్లందు, భద్రాచలం నియోజకవర్గాలు ఉన్నాయి. మహబూబాబాద్ లోక్‌సభ పరిధిలో మొత్తం 15,30,367 మంది ఓటర్లుండగా, పురుషులు 7,46,982 మంది, మహిళలు 7,83,280 మంది ఓటర్లు, ఇతరులు 105మంది ఓటర్లు ఉన్నారు. మొత్తం 1,813 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేశారు. మహబూబాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో అత్యధికంగా 2,58,451మంది ఓటర్లుండగా, నర్సంపేట నియోజకవర్గంలో 2,35,447 మంది, ములుగు నియోజకవర్గంలో 2,32,791 మంది ఓటర్లు ఉన్నారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 1,813 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

వరంగల్ లోక్‌సభ పరిధిలో అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఓట్లు

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం	పోలింగ్ స్టేషన్
స్టేషన్‌ఘనపూర్	1,24,769	1,28,282	02	2,53,053	290
పాలకుర్తి	1,25,952	1,28,496	13	2,54,461	294
పరకాల	1,07,752	1,13,865	02	2,21,619	239
వరంగల్ పశ్చిమ	1,38,607	1,43,251	16	2,81,874	244
వరంగల్ తూర్పు	1,24,809	1,31,634	339	2,56,782	230
వర్ధన్నపేట	1,33,778	1,38,929	17	2,72,724	278
భూపాలపల్లి	1,36,273	1,39,751	06	2,76,030	317
మొత్తం	8,91,940	9,24,208	395	18,16,543	1,892

మానుకోట లోక్‌సభ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాలో ఓటర్లు

డోర్నకల్	1,09,150	1,13,455	07	2,22,612	264
మహబూబాబాద్	1,26,611	1,31,794	46	2,58,451	287
నర్సంపేట	1,15,068	1,20,370	09	2,35,447	283
ములుగు	1,13,592	1,19,172	27	2,32,791	307
పినపాక	99,824	1,03,798	05	2,03,627	250
ఇల్లందు	1,09,812	1,15,094	04	2,24,910	242
భద్రాచలం	72,925	79,597	07	1,52,529	180
మొత్తం	7,46,982	7,83,280	105	15,30,367	1,813

నెలరోజుల్లో స్వల్పంగా పెరిగిన ఓటర్లు..

లోక్‌సభ స్థానం	మార్చి 16 (2014)	ఏప్రిల్ 16(2024)	పెరిగిన ఓట్లు
వరంగల్	18,16,429	18,16,543	114
మహబూబాబాద్	15,26,998	15,30,367	3,369



పులకించిన భద్రగిరి

కన్నుల పండువగా సీతారాముల కల్యాణ వేడుక

భద్రగిరి పులకించింది.. భక్తకోటితో హోరెత్తింది. పవిత్ర పుణ్యక్షేత్రం భద్రాచలంలో బుధవారం సీతారాముల కల్యాణ వేడుక అంగరంగ వైభవంగా సాగింది. తెల్లవారుజాము నుంచే మొదలైన వేడుక మధ్యాహ్నం ముత్యాల తలంబ్రాలతో ముగిసింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున చీఫ్ సెక్రటరీ శాంతికుమారి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సుప్రీంకోర్టు న్యాయమూర్తి పీఎస్ నరసింహ, హైకోర్టు అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, ఐజీ ఏవీ రంగనాథ్, టీటీడీ మాజీ చైర్మన్ కనుమూరి బాపిరాజు, దేవనాథ రామానుజ జీయర్‌స్వామి తదితరులు తరలివచ్చి కల్యాణ వేడుకను తిలకించారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాక దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలిరావడంతో భద్రాచలం కోలాహలంగా మారింది. -భద్రాచలం



జీలకర్రబెల్లంను భక్తులకు చూపుతున్న దృశ్యం



కల్యాణం వీక్షిస్తున్న మంత్రి సురేఖ, సీఎస్ శాంతికుమారి



పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



స్వామివారి ఊరేగింపు



ద్వారకా తిరుమల దేవస్థానంవారి పట్టువస్త్రాలు



గౌతమీ నదిలో పుణ్య స్నానాలు




చిన్నమడూరులో కల్యాణ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే యశస్విని రెడ్డి


జనగామ బాలాజీనగర్ రేణుక ఎల్లమ్మ దేవాలయంలో ఎమ్మెల్యే పల్లా పూజలు


నష్కల్‌లో పూజ చేస్తున్న ఎమ్మెల్యే కడియం, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కావ్య


నష్కల్‌లో వేడుకలకు హాజరైన బీజేపీ ఎంపీ అభ్యర్థి అరూరి రమేష్

అంగరంగ వైభవంగా శ్రీరామ నవమి

- వాడవాడలా కనులపండువగా సీతారాముల కల్యాణం
- జనగామలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పూజలు
- తాటికొండలో వేడుకలకు హాజరైన కడియం శ్రీహరి
- చిన్నమడూరు పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

జనగామ కల్చరల్, ఏప్రిల్ 17: జనగామ పాతబీటు బజారులో గణేష్ ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం సీతారామ కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. పురోహితులు మేళ్లచెర్వు అప్పయ్య శాస్త్రి, త్రిపురారి నాగరాజశర్మ, కృష్ణమాచార్య సిద్దాంతి నేతృత్వంలో సీతారాముల విగ్రహాలను వేదికపై చేర్చి కన్యాదానం, జీలకర్ర బెల్లం, మాంగళ్య ధారణ కార్యక్రమాలు నిర్వహించారు. వేద మంత్రాల మధ్య రాముల వారి కల్యాణం జరిపించారు. వేడుకలకు జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సతీ సమేతంగా హాజరయ్యారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమున, కౌన్సిలర్ హరిశ్చంద్ర గుప్తా తదితరులు పాల్గొన్నారు. చీటకోడూరు పంచకోసు రామలింగేశ్వర స్వామి దేవాలయంలో ప్రధానార్చకుడు కాసోజు రాజేశ్వరాచార్యుల నేతృత్వంలో, జిల్లా కేంద్రంలోని బాణాపురం శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రధానార్చకులు క్రిష్ణమాచార్య సిద్దాంతి నేతృత్వంలో, బాలాజీనగర్ రేణుక ఎల్లమ్మ ఆలయంలో పూజారి ప్రసాద్ శర్మ నేతృత్వంలో, శ్రీరాంనగర్ కాలనీ అభయాంజనేయ స్వామి దేవాలయంలో అర్చకుడు మోహన కృష్ణ భార్గవ ఆధ్వర్యంలో సీతారామ కల్యాణం జరిపించారు. తహసిల్దార్ కార్యాలయం సమీపంలోని సంతోషిమాత దేవాలయంలో పారునంది శ్రీనివాస శర్మ ఆధ్వర్యంలో, గుండ్లగడ్డ ఉమామహేశ్వర స్వామి దేవాలయంలో అర్చకులు రాజేష్ భార్గవ నేతృత్వంలో వేడుకలు నిర్వహించారు. సంజయనగర్ చమన్ ఆంజనేయ స్వామి దేవాలయంలో వనిత క్లబ్ గ్రేటర్ ఆధ్వర్యంలో స్వామి వారి కల్యాణం జరిగింది. క్లబ్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ గంగిశెట్టి ప్రమోద్ కుమార్ స్వామి వారికి పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు.

చిలుపూర్: నష్కల్ సీతారామచంద్ర స్వామి ఆలయంలో రాములోరి కల్యాణం ఘనంగా జరిపించారు. స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి కడియం కావ్యతో పాటు, బీజేపీ అభ్యర్థి ఆరూరి రమేష్, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ నాయకులు ఏడవెళ్ళి మాధవరెడ్డి, బెలిదె వెంకన్న, మాదిరెడ్డి యశ్వంత్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ చిర్ర నాగరాజు వేర్వేరుగా పూజలకు హాజరయ్యారు. పల్లగుట్టలో నిర్వహించిన రాములోరి కల్యాణ వేడుకలకు చిలుపూర్ గుట్ట దేవస్థానం మాజీ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు - కిరణ్మయి దంపతులు హాజరయ్యారు. శ్రీపతిపల్లిలో నిర్వహించిన వేడుకలకు పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ లాల్ దంపతులు హాజరయ్యారు. మల్కాపూర్, చిన్నపెండ్యాల, రాజవరం, చిలుపూర్ గుట్ట బుగులు వెంకన్న ఆలయంలో నిర్వహించిన వేడుకలకు రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా నాయకుడు ఏడవెళ్ళి మాధవరెడి, మాదిరెడ్డి యశ్వంత్‌రెడ్డి దంపతులతో పాటు, ఎంపీటీసీలు తాళ్ళపల్లి ఉమ సమ్మయ్య, మారెపల్లి లలితాదేవి శ్యామ్‌కుమార్ రెడ్డి, హాజరయ్యారు.

జఫర్‌గడ్: స్థానిక శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో పూజారులు పొడిచేటి శ్రీనివాసాచార్యులు, తయ్యాల కృష్ణమాచార్యులు, పొడచేటి వెంకటాచార్యుల నేతృత్వంలో స్వామి వారి కల్యాణం నయనానందకరంగా సాగింది. కూనూరు, తిమ్మంపేట, తిడుగు, షాపల్లి, తమ్మడపల్లి(జి), ఉప్పుగల్లు, తమ్మడపల్లి(ఐ), తదితర గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్: స్టేషన్‌ఘన్‌పూర్ తిరుమల నాథస్వామి దేవాలయంలో, శివునిపల్లి నగరేశ్వరాలయంలో, రైల్వే స్టేషన్ వద్ద ఉన్న సీతా రామచంద్రాలయంలో, శివునిపల్లి బొడ్రాయి వద్ద ఆంజనేయ స్వామి దేవాలయంలో సీతారాముల కళ్యాణం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో ఉత్సవ కమిటీల బాధ్యులు కలకోట రంగాచారి, రైస్ మిల్లర్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బెలిదె వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్: తాటికొండ గ్రామ శివారులోని సీతరామచంద్ర స్వామి ఆలయంలో సీతారాముల కల్యాణం కన్నులపండువగా నిర్వహించారు. సీతా-రాముల ఎమ్మెల్యే కడియం శ్రీహరి, కాంగ్రెస్ పార్టీ వరంగల్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్య దేవతామూర్తులను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. మీదికొండ సాయిబాబా మందిరంలో అర్చకుడు క్రాంతి కుమార చార్యుల ఆధ్వర్యంలో వేడుకలు వైభవంగా నిర్వహించారు.

కొడకండ్ల: మండలకేంద్రంలోని రామాలయంతో సహా ఏడునూతుల లోని శ్రీ వేణు గోపాలస్వామి, పెదబావి తండాలోని శ్రీ సీతారామాలయం, రామవరం, పాఖాలలోని రామాలయాల్లో వేదపండితులు పి.దక్షిణామూర్తి, మౌర్య శర్మ ఆధ్వర్యంలో శ్రీసీతారామచంద్రుల ఉత్సవ విగ్రహాలకు కల్యాణం జరిపించారు.

రఘునాథపల్లి: రఘునాథపల్లి శివారులో ఉన్న దొడ్డిగుట్ట దేవునిలొద్ది వద్ద రాములోరి కళ్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ఎంపీటీసీ సభ్యురాలు పేర్నె ఉష-రవి దంపతులు పట్టు వస్త్రాలు, పుస్తె మట్టెలతో పాటు తలంబ్రాలను సమర్పించారు.

దేవరుప్పుల: చిన్నమడూరులో అంగరంగ వైభవంగా జరిగిన శ్రీసీతా రాముల కల్యాణానికి పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పూజలు చేశారు. సీతారాంపురంలో ఎంపీపీ బస్వసావిత్రి దంపతులు ప్రత్యేకపూజలు చేశారు. దేవరుప్పుల రెడ్డి సంఘం ఆధ్వర్యంలో శ్రీసీతారాముల కల్యాణం ఘనంగా జరిపించారు.

నర్మెట: మండల కేంద్రంతోపాటు వెల్దండ, మచ్చుపహడ్, అమ్మాపురం గ్రామాల్లో పురోహితులు సీతారామశర్మ, సతీష్ శర్మ, ప్రయాగ నాగ భూషణంశర్మ, గోపాలకృష్ణ, ప్రణయ్‌శర్మ ఆధ్వర్యంలో కళ్యాణ తంతు వైభవంగా నిర్వహించారు.

తరిగొప్పుల: మండల కేంద్రంలోని భక్తాంజనేయ దేవస్థానంలో వేద పండితులు చెప్యాల సోమేశ్వర్ శర్మ, సతీష్ శర్మ ఆధ్వర్యంలో దేవతామూర్తులకు పట్టువస్త్రాలు అలంకరించి శస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. నర్సాపూర్ గ్రామంలో బబ్బుల సంపత్ కుమార్ గుప్త, బచ్చు శ్రీమన్నారాయణ ఆధ్వర్యంలో రాములోరి కళ్యాణం రమణీయంగా నిర్వహించారు.

బచ్చన్నపేట: మండలంలో శ్రీరామనవమి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. ఆలీంపూర్‌లో ముస్లిం మతానికి చెందిన ఎంపీటీసీ ఎండీ మసూద్ దేవతామూర్తులకు పట్టు వస్త్రాలు అందించి మత సామరస్యాన్ని చాటారు. బచ్చన్నపేట మార్కండేయ ఆలయం, ఎద్దుగూడెం, కట్కూరు, ఇటుకాపల్లి, కొన్నె, కేశిరెడ్డిపల్లి, కొడవటూరు, బసిరెడ్డిపల్లి గ్రామాల్లో ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆలయాల వద్ద దాతల సహకారంతో అన్నదానాలు నిర్వహించారు. గతంలో ఈ విధంగా ఎప్పుడూ ఉత్సవాలను చూడలేదని పలువురు చర్చించుకున్నారు.


పల్లగుట్టలో పూజ చేస్తున్న చిలుపూర్ ఆలయ మాజీ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు దంపతులు


శ్రీపతిపల్లిలో ఉత్సవమూర్తులతో ప్రదక్షిణలు చేస్తున్న పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్యామ్‌ప్రసాద్ లాల్ దంపతులు


స్టేషన్ ఘన్‌పూర్ తిరుమల నాథస్వామి దేవాలయంలో కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేద పండితులు


జనగామ పాతబీటు బజారులో కల్యాణం జరిపిస్తున్న పూజారులు


జఫర్‌గడ్‌లో సీతారాముల కల్యాణం జరిపిస్తున్న పండితులు


కొడకండ్లలో శ్రీసీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు


రఘునాథపల్లిలో పట్టువస్త్రాలు తెస్తున్న ఎంపీటీసీ పేర్నె ఉష దంపతులు


శివునిపల్లిలో సీతారాముల విగ్రహాలను తీసుకు వస్తున్న భక్తులు


ఎద్దుగూడెంలో సీతారాముల కల్యాణ వేడుకలు


నెల్లుట్లలో మొక్కులు చెల్లిస్తున్న ఎంపీపీ దంపతులు


జీడికల్‌లో తాళిబొట్టు చూపిస్తున్న పండితుడు


తాటికొండలో కల్యాణానికి హాజరైన భక్తులు

కొమ్మూరికి త్రైత సిద్ధాంత క్యాలెండర్


కొమ్మూరికి క్యాలెండర్ అందిస్తున్న ప్రబోధ సేవాసమితి ప్రతినిధులు

జనగామ కల్చరల్, ఏప్రిల్ 17: శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆచార్య ప్రభోదానంద ఆధ్వర్యంలో త్రైత సిద్దాంత ఉగాది తెలుగు క్యాలెండర్‌ను డీసీసీ అధ్యక్షులు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి అందజేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో త్రైత సిద్దాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞానవేదిక జనగామ కమిటీ అధ్యక్షుడు శ్రీనాథ్ శ్రేష్టి మాట్లాడుతూ తెలుగు నెలలు అనుసరించేందుకు వీలుగా తెలుగు తిథులతో ఆంగ్ల తేదీలను పొందుపరిచి తయారుచేసిన గొప్ప కాలసూచిక అన్నారు. కార్యక్రమంలో ఉపేందర్, కావేటి శివకుమార్, సావిత్రి, శ్రీనివాస్, కొన్నె వెంకటేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణోత్సవానికి రూ.70వేల విరాళం

స్టేషన్‌ఘన్‌పూర్, ఏప్రిల్ 17: మండలంలోని తాటికొండ గ్రామ శివారులోని పురాతన శ్రీ సీతా-రామచంద్రస్వామి ఆలయంలో రాములోరి కల్యాణోత్సవాల నిర్వహణకు గాను మాజీ సర్పంచ్ చల్లా ఉమాదేవి-సుధీర్ రెడ్డి బుధవారం రూ.70,000 విరాళం అందించారు. వారం రోజుల పాటు జరిగే ఉత్సవాల నిర్వహణకు తమ వంతుగా విరాళం అందించినట్లు తెలిపారు. అనేక ఏళ్లుగా తమ కుటుంబం రాములోరి ఆలయానికి సేవలు అందిస్తోందని అన్నారు. రానున్న రోజుల్లో ఆలయం అభివృద్ధికి తమ వంతు సాయం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పండుగ భద్రయ్య, పీఏసీఎస్ చైర్మన్ నరేందర్ రెడ్డి, బేతి రత్నాకర్ రెడ్డి, తాటికొండ సంపత్‌యాదవ్, పాలకుర్తి నాగరాజు, అర్చకుడు వరుణాచార్యులు తదితరులు పాల్గొన్నారు.


ఆలయ చైర్మన్‌కు విరాళం అందిస్తున్న మాజీ సర్పంచ్ చల్లా ఉమాదేవి

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

దేవరుప్పుల, ఏప్రిల్ 17: మండలం రామచంద్రాపురం వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మాచర్ల భిక్షపతి (45) అనే వ్యక్తి దుర్మరణం చెందారు. దేవరుప్పుల మండలం మాధాపురం గ్రామానికి చెందిన భిక్షపతి రాంచంద్రాపురంలో ఉన్న బంధువుల ఇంటికి వెళ్లి మోపెడ్‌పై తిరిగి వస్తుండగా గ్రామం చివర ఉన్న దుర్గమ్మగుడి వద్ద అదుపుతప్పి పడిపోయాడు. తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని జనగామ ఏరియా ఆసుపత్రికి తరలించారు. భిక్షపతికి భార్య రాధతో పాటు పెళ్లైన కూతురు, కుమారుడు ఉన్నారు.

21 వరకు మార్కెట్‌కు సెలవులు

జనగామ కల్చరల్, ఏప్రిల్ 17: జనగామ వ్యవసాయ మార్కెట్ యార్డుకు మరో మూడు రోజులు సెలవులు ప్రకటించారు. మార్కెట్ యార్డులో వ్యవసాయ ఉత్పత్తులు పేరుకుపోవడంతో రోజు వారీ క్రయ విక్రయాలకు ఆటంకం కలుగుతున్నందున ఈ నెల 21 వరకు సెలవులు పొడిగించినట్లు మార్కెట్ కమిటీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి ఎస్.శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాగా, ఇప్పటికే ఈ నెల 16 నుంచి 18 వరకు సెలవులు ప్రకటించగా తాజా ప్రకటనతో ఆరు రోజుల పాటు మార్కెట్ యార్డు బంద్ ఉండనుంది.

వికలాంగుల సమస్యలను పరిష్కరించాలి

హక్కుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు స్వామినాయక్

దేవరుప్పుల, ఏప్రిల్ 17: వికలాంగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి జనగామ జిల్లా అధ్యక్షుడు స్వామినాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆయన దేవరుప్పులో విలేకరులతో మాట్లాడుతూ సదరం సర్టిఫికెట్ జారీ అయి ఏళ్ల గడుస్తున్నప్పటికీ దరఖాస్తులు చేసుకున్న అర్హులైన వికలాంగులకు ప్రభుత్వం ఇంతవరకు పెన్షన్లు పంపిణీ చేయటం లేదన్నారు. సంబంధిత మండల అధికారులను అడిగితే ప్రభుత్వం ఫ్రీజింగ్ విధించిందని, ఆన్‌లైన్ ఓపెన్ కావటం లేదని, సైట్ లాగిన్ అవ్వటం లేదని సాకులు చెబుతున్నారన్నారు. పెన్షన్లు అనేది నిరంతర ప్రక్రియ అని ఎప్పుడైనా దరఖాస్తులు చేసుకోవచ్చని గత ప్రభుత్వాలు చెప్పాయని, ప్రస్తుత ప్రభుత్వం సైతం అదే చెబుతున్నదని అన్నారు.

అప్పుల బాధతో యువరైతు ఆత్మహత్య


సుభాష్ (ఫైల్)

చిలుపూర్, ఏప్రిల్ 17: వెంకటాద్రిపేట గ్రామానికి చెందిన రైతు నాగారపు సుభాష్ (40) అప్పుల బాధ తాళలేక బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయనకున్న ఎకరం భూమికి తోడు ఏడాది క్రితం మరో నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేశాడు. పంట దిగుబడి రాకపోవడంతో రూ.6 లక్షల వరకు అప్పులయ్యాయి. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపం చెంది సోమవారం పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మరణించాడు. సుభాష్‌కు భార్య కోమలతో పాటు, కుమార్తె ఉష ఉంది. ఎస్సై ముత్యం రాజేందర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అకాల వర్షానికి తడిసిన ధాన్యం

బచ్చన్నపేట, ఏప్రిల్ 17: మండలంలో బుధవారం రాత్రి కురిసిన అకాల వర్షానికి పలు గ్రామాల్లో కల్లాల్లో ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది. బోనకొల్లూరు, బసిరెడ్డిపల్లి, బండనాగారం లక్ష్మాపూర్ తదితర గ్రామాల్లో బుధవారం రాత్రి అకస్మాత్తుగా వాతావరణం చల్లబడటంతో పాటు, వర్షం పడింది. అయితే రెండు రోజుల పాటు అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు కావటంతో వర్షం కురియదనే నమ్మకంతో రైతులు ధాన్యం ఆరబోశారు. కాగా వర్షం పడ్డపుడు అంతా చీకటి ఉండడంతో పరదాలు కప్పేందుకు రైతులు తీవ్ర అవస్థలు పడ్డారు.

అమ్మాపురంలో బీజేపీ ప్రచారం

నర్మెట, ఏప్రిల్ 17: మండలంలోని అమ్మాపురం గ్రామంలో బుధవారం బీజేపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని బీజేపీ దళిత మోర్చ మండలాధ్యక్షుడు బిచ్చాల కొమురెల్లి పిలుపునిచ్చారు. గ్రామంలో ఇంటింటా తిరుగుతూ నరేంద్రమోదీ నాయకత్వంలో కేంద్రం ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎర్ర భాస్కర్, గంగం రాంరెడ్డి, ఎర్రబోతులు బన్ని, సుధాకర్, చంద్రారెడ్డి, బ్రహ్మచారి తదితరులు పాల్గొన్నారు.

తరిగొప్పులలో సీపీఎం నాయకుల పర్యటన..

తరిగొప్పుల, ఏప్రిల్ 17: మండలకేంద్రంలో బుధవారం సీపీఎం నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్లమెంట్ ఎన్నికల మండల ఇన్‌చార్జీ ధర్మభిక్షం మాట్లాడుతూ బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ప్రజలను మోసం చేస్తూ డబ్బు బలంతో ఎన్నికల్లో పోటీ చేస్తున్నాయని, సీపీఎం అభ్యర్థి ఎమ్డీ జహంగీర్ నిరంతరం ప్రజా సమస్యలపై తన గొంతు విప్పుతాడని, సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుకు ఓటువేసి ఆయనను భారీ మోజారితో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రజ్ఞాపురం నర్సింహులు, అంజన్న, భిక్షపతి, ఎల్లయ్య, సారయ్య పాల్గొన్నారు.

పదేళ్లుగా బీసీలను అణచివేస్తున్న బీజేపీ

బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు లోకుంట్ల ప్రవీణ్

దేవరుప్పుల, ఏప్రిల్ 17: పదేళ్ల బీజేపీ పాలనలో బీసీలకు రక్షణ లేక అణిచివేతకు గురయ్యారని బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు లోకుంట్ల ప్రవీణ్ అన్నారు. బుధవారం దేవరుప్పుల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి బీసీ అని చెప్పుకోవటం తప్ప బీసీలకు ఆయన చేసిందేమీ లేదన్నారు. మతం పేరుతో కులాల మధ్య చిచ్చు పెట్టడమే బీజేపీ నైజమన్నారు. కాంగ్రెస్ హయాంలో బ్యాంకులను జాతీయం చేసి ప్రభుత్వపరం చేస్తే బీజేపీ ప్రైవేటు పరం చేసిందన్నారు. రైల్వేశాఖను సైతం ప్రైవేటు పరం చేస్తున్నారని, ప్రభుత్వ ఆస్తులకు రక్షణ కరువైందని అన్నారు. చట్టాలపేరుతో రైతులకు అన్యాయం చేసిందని, ధర్నాలు, రాస్తారోకోలు చేసిన రైతులను జైళ్ల పాలు చేసిందని న్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నల్ల శ్రీరామ్, నాయకులు ధర్మారెడ్డి, రవీందర్, రమేష్, నాగరాజు, యాకస్వామి, జాకీర్, సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


దేవరుప్పులలో మాట్లాడుతున్న లోకుంట్ల ప్రవీణ్